
"బావా... ఇదిగో ఇదే చివరాఖరి ఫైనల్ వార్నింగ్" ముక్కు చీదుతూ అంది నీలవేణి భర్తతో...

"అబ్బబ్బ... సరేలేవే... ఇప్పుడు నేనేమన్నానని ?" అంటూ మళ్ళీ సిగరెట్ నోట్లో పెట్టుకుని ఓసారి గుండెల నిండా పొగ పీల్చి వదిలాడు.

"అదిగో మళ్ళీ సిగరెట్ నోట్లో పెట్టుకున్నావు ?" రాగాలు తీస్తూ —సోఫాలో నుంచి లేచి కింద కూలబడింది.

నాలిక్కర్చుకున్న గోపాలం సిగరెట్‌ని అతి బాధగా కిటికీలో నుంచి బయటకు గిరాటేశాడు.

గోపాలం మేనత్త కూతురు నీలవేణి.




లాగూ, చొక్కా వేసుకున్నప్పటి నుంచి కలిసి మెలిసి తిరిగారు. పెద్దయ్యాక మొగుడు, పెళ్ళాలయ్యారు. అయినా భర్తని 'ఏవండీ... ఏమోయ్... ఏరా... అనకుండా చిన్నప్పటి నుంచి 'బావా' పిలుపునే కంటిన్యూ చేస్తుంది.

హైస్కూల్ వరకూ ఊళ్ళోనే బుద్ధిగా చదువుకున్న గోపాలం కాలేజీ చదువుల కెళ్ళి, పరీక్షల్లో ర్యాంకులు తెచ్చుకోకున్నా సిగరెట్ అలవాటొకటి చేసుకొచ్చాడు. బొటాబొటి మార్కులతో ప్యాసయిన గోపాలానికి, నీలవేణి తండ్రి తన పలుకుబడితో ఓ ఉద్యోగం ఇప్పించి కూతుర్నీ 'సమర్పించు'కున్నాడు.

మకాం సికింద్రాబాద్‌కు మారింది. అయితే మారనిదల్లా గోపాలానికి సిగరెట్ మీద సిగరెట్ కాల్చే అలవాటు. నిత్యాగ్ని హోత్రం ఎప్పుడూ అతని పెదాల మీద ఉండాల్సిందే. రోజుకు మినిమమ్ ఓ రెండు పెట్టెలు కాల్చనిదే మనశ్శాంతిగా ఉండదు.

బావ మీద ప్రేమతో ఈ విషయం తండ్రికి చెప్పక పోయినా, అసలే సిగరెట్ తాగే వాళ్ళంటే సదభిప్రాయం లేని నీలవేణి, ఈ మధ్య సిగరెట్ వల్ల మనిషి ఆయుష్షు కూడా క్షణాల చొప్పున తరిగిపోతుందన్న విషయం తెలుసుకుని సామ, దాన, భేద, దండోపాయాలు ప్రయోగించింది. అయినా లాభం లేకపోయింది.

గోపాలానికి మరదలూ ప్లస్సూ భార్య అయినా నీలవేణి అంటే ప్రేమే. కానీ, సిగరెట్ అలవాటుని మానుకోవడం అంటే కష్టమే. అయినా మరదలు మీద ప్రేమతో అలా గేటవతల బయటికెళ్ళి కాలుస్తాడు.

గత వారం రోజులుగా 'సిగరెట్' వాళ్ళ వైవాహిక జీవితంలో 'కోల్డ్ వార్' సృష్టిస్తూనే ఉంది.

భార్య ముక్కు చీదగానే "నీ కన్నా నాకేదీ ఎక్కువ కాదు నీలూ..." అంటూ ఓ డైలాగ్ చెప్పేసి. సిగరెట్‌ని బయటకు గిరాటేసేయడం, భార్య అటు వెళ్ళగానే బాత్రూమ్‌లో దూరో, ఇప్పుడే అలా మార్కెట్‌కు వెళ్ళొస్తానని చెప్పో, బయటే తాగేసి రావడం మొదలెట్టాడు.

కిం కర్తవ్యం అంటూ ఆలోచనలో పడ్డ నీలవేణి, ఆ కాలనీకి వచ్చిన ఓ సాధువును దర్శించుకోవడానికి వెళ్ళింది. ఆ సాధువు హితబోధలు చేస్తున్నాడు. "అతి సర్వత్ర వర్జయేత్" అని విపులీకరించి చెబుతున్నాడు. "అతి" కొన్ని విషయాల్లోనూ మొహం మొత్తేలా చేస్తుందని చెబుతున్నాడు.

నీలవేణి మెదడులో ఓ ఆలోచన తళుక్కుమంది. 'బావా ... అయిపోయావ్' ... అనుకుంది. తథాస్తు దేవతలు 'ఓ. కె. ప్రొసీడ్' అనేశారు.

* * *

గోపాలానికి క్షణ క్షణానికి బి. పి. పెరిగిపోతోంది. బయటకు వెళ్ళాలంటే, "నేనూ నీతో వస్తాను బావా" అంటోంది నీలవేణి. నేను ఫ్రెండింటికి వెళ్తానని చెబితే 'ఫ్రెండింటికే కాదు, నరకానికైనా' వస్తానంటోంది. చివరాఖరికి బాత్రూమ్‌కి వెళ్లానన్నా, బాత్రూమ్ తలుపు బయటే ఉండి లోపలి నుంచి సిగరెట్ పొగ ఏమైనా బయటికి వస్తుందేమోనని ఎంక్వయిరీ చేస్తోంది.

* * *

నీలవేణి అంటే చచ్చేంత ప్రేమున్నా, సిగరెట్ పది నిమిషాలకు ఒక్కసారైనా ఎట్‌లీస్ట్ అరగంటకోటైనా కాల్చకపోతే 'చస్తానేమో' ననే బెంగ పట్టుకుంది గోపాలానికి.

"నీలూ... నాకీ అగ్ని పరీక్ష ఎందుకు ?" అని తనలో తనే గొణుక్కున్నాడు ... ఆఫీసు నుంచి ఇంట్లోకి అడుగు పెట్టి గభాలున బయటకు పరుగెత్తి తన ఇంటి నెంబరు ఓసారి సరిచూసుకున్నాడు. నెంబరదే... అది తనిల్లే... కానీ ఆ సెటప్ ఏంటి ? కొంపదీసి ఏ సినిమా కంపెనీ వాళ్ళేవరైనా షూటింగ్ చేసుకోవడానికి వచ్చారా ?"

లోపలికి అడుగు పెట్టగానే, రాఘవేంద్రరావు సినిమాల్లో కనిపించే పూలు, పండ్లలా... సిగరెట్ ప్యాకెట్స్... ఎదురుగా షోకేసులో ఓ డిజైన్‌లో సిగరెట్ ప్యాకెట్స్ !...

కొంపదీసి రాఘవేంద్రరావు సిగరెట్ల బేస్ మీద హీరో హీరోయిన్లయితో డ్యూయెట్ తీయడం లేదు కదా ! హీరోయిన్ బొడ్డు మీదికి హీరో సిగరెట్లు విసురుతూ ఉండడమో, సిగరెట్ల బెడ్ మీద హీరోయిన్ పడుకోవడం... రక రకాలుగా ఊహించుకుంటూ లోపలికి అడుగు పెట్టగానే రాఘవేంద్రరావుకు ఏ మాత్రం తగ్గని "బెస్ట్" ఉందని నిరూపిస్తూ తన భార్య నీలవేణి కనిపించింది. సిగరెట్ ప్యాకెట్లను దండగా పేర్చి గోపాలం మెడలో వేసింది.

బలి ఇచ్చేటప్పుడు ఇంకా మెడలో నిమ్మకాయల దండ వేస్తారనే విషయం గుర్తుకు రాకపోవడం గోపాలం అదృష్టం.

* * *

"నీలూ... నీలూ డియర్, నీలవేణి పెళ్ళామా... మైనీలూ... మేరానీలూ... క్యాసీన్ హై, క్యా అదృష్టం హై... ఇది నిజమా, ఏవిటీ సెటప్పు... ఏమిటా

గెటప్పు..." అతిగా డైలాగులు వదులుతున్న తన బావకి మెంటల్ బ్యాలెన్స్ ఏమైనా తప్పిందేమోననే డౌట్ వచ్చింది నీలవేణికి.

వెంటనే తన కుడి చేతిలో ఉన్న సిగరెట్ ప్యాకెట్ చూపించి "ఇదే బ్రాండ్ బావా ?" అని అడిగింది.

"బ్రిస్టల్... ఆ రోజుల్లో నేనో కలగనేవాడిని..." అన్నాడు 'యాడ్' ని గుర్తు తెచ్చుకుంటూ గోపాలం.

"మరిది..." ఎడమ చేతిలోకి సిగరెట్ ప్యాకెట్ చూపిస్తూ అడిగింది.

"చార్మినార్... డింగ్... డింగ్..." అన్నాడు.

"మరి దీని పేరు..." అంటూ గిర్రున వెనక్కి తిరిగింది... తన తలలో తురుముకున్న మరో సిగరెట్ ప్యాకెట్‌ని చూపిస్తూ...

"త్రిబుల్ ఫైవ్..." అన్నాడు గోపాలం.

"హమ్మయ్యా... నీ మెంటల్ బ్యాలెన్స్ బాగానే ఉంది" అంది ఊపిరి పీల్చుకుంటూ నీలవేణి.

"మరి నీ మెంటల్ బ్యాలెన్స్..." కాస్త అనుమానంగా అడిగాడు గోపాలం.

"నేనూ ఓ. కే... నే బావా... ఈ రోజే మన కాలనీకి వచ్చిన ఓ సాధువు దగ్గరికి వెళ్ళాను. భర్త దారిలో భార్య నడవాలని, భర్త కోరికను తీర్చడం భార్య ధర్మమని, సతీ సుమతి అయితే ఏకంగా భర్తని, మరో అమ్మాయి దగ్గరికే తీసుకెళ్ళిందని బోల్డు హితబోధలు చేశాడు. నాకు జ్ఞానోదయం అయింది బావా ! అందుకే ఇన్నాళ్ళూ నీ కిష్టమైన సిగరెట్‌ని కాల్చకుండా చేసిన పాపాన్ని ఈ విధంగా పరిహారం చేసుకుంటున్నాను. కాల్చు బావా... నా తృప్తి కోసం, ఇప్పుడే... ఇక్కడే ఓ సిగరెట్ కాల్చి ఆ పొగని అలా... అలా ... స్టయిల్‌గా నా గుండెల్లోకి దూసుకుని వెళ్ళేలా వదులు బావా..." తన్మయంగా అంది నీలవేణి.

గోపాలం ఎగిరి గంతేయలేదు కానీ ఇంచుమించు ఆ మూడ్‌లోనే ఉన్నాడు.

నీలవేణే స్వయంగా ఓ సిగరెట్ భర్త పెదవుల మధ్య పెట్టింది. తనే అంటించింది. గుండెల నిండా పొగపీల్చి వదిలాడు.

"థాంక్యూ... నీలూ... సిగరెట్ మనిషికి ఆక్సిజన్ లాంటిది..." అన్నాడు ఆ ఉత్సాహంతో...

"అవునా... బావా... అంది మరో సిగరెట్ చేతిలో పట్టుకుని గోపాలం సిగరెట్ చివరంటా కాల్చి యాష్ ట్రేలో వేశాడో లేదో... మరో బ్రాండ్ సిగరెట్ ఇచ్చింది.

"అప్పుడేనా... ఇది కలా ! నిజమా ! అని తెగ ఆనందపడిపోతూ... మరో సిగరెట్‌ని పెదవుల మధ్య పెట్టుకున్నాడు.

"నీలో ఈ మార్పు ఇలానే ఉండాలి నీలూ... నిన్ను చేసుకోవడం నా అదృష్టం నీలూ... భర్త ఇష్టాన్ని గౌరవించే నువ్వు నా భార్య కావడం నా పూర్వజన్మ సుకృతం. నీలూ... మొగుడు సిగరెట్ కాల్చగానే, మొగుడ్నే కాల్చేసేలా చూసే భార్యలున్న ఈ రోజుల్లో మొగుడి ఇష్టాన్ని గౌరవించిన నీలాంటి వాళ్ళుండడం, నా దేశం చేసుకున్న పుణ్యం నీలూ...

"చాలు బావా... అన్ని 'నీలూ...' లు వద్దు బావా... ఇప్పుడే ఇంకేం చూశావు బావా... నీ నీలూ లీలలు వరుసగా చూస్తావు బావా..." అంది కసిగా నీలవేణి.

పైన తథాస్తు దేవతలు 'తథాస్తు' అన్నారు చిరునవ్వుతో.

★ ★ ★

రెండో సిగరెట్ అలా కాల్చి పారేశాడో లేదో మూడో బ్రాండ్‌ది, మూడో సిగరెట్ అందించింది.

"కాస్త టీ తాగి కాలుస్తాను" అన్నాడు గోపాలం.

"వద్దు బావా... టీ కన్నా సిగరెట్‌లోనే ఎనర్జీ ఉంటుంది" అంది నీలవేణి. ఇదే డైలాగ్ ఇది వరలో



తను అన్నట్టు గుర్తొచ్చి గతుక్కుమని భార్య మొహంలోకి చూశాడు.

"ఏంటి బావా ? ఇది కొత్త బ్రాండ్ అని చూస్తున్నావా ? కాల్చిన సిగరెట్ కాల్చకుండా, వాడిన బ్రాండ్ వాడకుండా నువ్వు సిగరెట్ మీద సిగరెట్ కాల్చాలి... గిన్నిస్ బుక్‌లో నీ పేరు చూడాలి... కాల్చు బావా కాల్చు... అంది ఎమోషనల్‌గా !...

అతి కష్టం మ్మీద మూడో సిగరెట్ కాల్చాడు... తర్వాత నాలుగోది, మరో బ్రాండ్‌ది రెడీ... అతనిలోని విసుగు క్లయిమాక్స్‌కు వచ్చేస్తోంది !

★ ★ ★

"కాల్చి కాల్చి నోరు నెప్పెడుతూంది నీలూ... పెదవులూ ఎండిపోయాయి. ఇప్పటికింక చాలు నీలూ..." అన్నాడు నీరసంగా సోఫాలో వాలిపోతూ...

కనీసం లుంగీ కూడా మార్చుకోనీయకుండా నాన్‌స్టాప్‌గా భర్తకు సిగరెట్లు అందిస్తూనే ఉంది. పైగా ఒక్క క్షణం అతగాడు ఆలస్యం చేసినా "నన్ను చంపుకు తిన్నట్టే" అంటుంది.

★ ★ ★

నోరంతా పాడయిపోయింది. బ్రష్ చేసుకుని వస్తాను. వేడి వేడి సాంబారు, వడియాలు రెడీ చేయమని చెప్పి బాత్రూమ్‌లోకి దూరాడు.

ఫ్రెష్షప్ అయి డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చి గిన్నె మీద మూత తీసి షాకయ్యాడు. అందులో సాంబారు లేదు. సిగరెట్ ప్యాకెట్లున్నాయి. మరో గిన్నె మీద మూతతీశాడు వడియాలకు బదులు సిగరెట్లు ఉన్నాయి.

"నీలూ..." నీరసంగా అరిచాడు.

"బావా... వస్తున్నా..." అంటూ సిగరెట్ లైటర్‌తో వచ్చింది.

"ఆకలేస్తోంది..." అన్నాడు కోపాన్ని తగ్గించుకుని నీరసంగా.

"ముందో సిగరెట్ లాగించు బావా... అన్నం గిన్నం జాన్తానై... అంటావు" అంది ప్లేటులోని సిగరెట్‌ని బావకి అందిస్తూ.

"ఓసే నీలూ... కళ్ళు పోతాయే... నన్ను ఆకలితో చంపకే... సిగరెట్ కంపుతో నోరంతా పాడైపోయింది" అంటూ బావురుమన్నాడు. ఆ పూటకి అతి కష్టమ్మీద అన్నం వడ్డించింది. కానీ పక్క మీద మాత్రం మరో నాలుగు సిగరెట్లు కాల్చేదాకా వదల్లేదు.

ఆ రోజు అర్ధరాత్రి దాటాక, నీలవేణి పడుకున్నదని కన్‌ఫర్మ్ అయ్యాక హాల్లోకి వచ్చి సోఫామీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు గోపాలం.

★ ★ ★

మరునాడు టిఫిన్‌కు ముందు రెండు ప్యాకెట్లు కాల్చేదాకా వదల్లేదు. టిఫిన్ కూడా రుచించలేదు. అతని అదృష్టం తిరగబడింది ఆ రోజు ఆదివారం అయింది. సిగరెట్ మీద సిగరెట్... రాత్రి అయ్యేవరకూ నీరసించి నేలమీద కూలబడి ఒక్కసారిగా పిచ్చెక్కినట్టుగా లేచి ఇంట్లో ఉన్న సిగరెట్ ప్యాకెట్లను రోడ్డు మీదకి గిరాటేసి నీలవేణి కాళ్ళమీద పడిపోయి...

"నీ పతి భక్తిని పంజాబ్ తీవ్రవాదులు ఎత్తుకుపోను... నీ ప్రేమను పంజాబ్ మిలిటెంట్లు కిడ్నాప్ చేయ... వద్దు నీలూ... నాకీ సిగరెట్లు తాగే నికృష్టపు బ్రతుకువద్దు... తాగి తాగి పొగ పీల్చి పీల్చి బుగ్గలు నొప్పెట్టి, చేయి నొప్పెట్టి, నా బ్రతుకు కాశ్మీర్ సరిహద్దు సమస్యలా తయారైంది... అమ్మో... హమ్మో... కావాలంటే రోజూ నీ కాళ్ళు నొక్కుతా... నా కీ పనిష్మెంట్ వద్దని ఘోరాతి ఘోరంగా వాపోయాడు... సిగరెట్ అంటేనే రోత మొదలైంది. సిగరెట్ మీద సిగరెట్ కాల్చి, కాల్చి నోటికి రుచే లేకుండా పోయింది.

"వద్దు బావా తప్పు..." అంది నీలవేణి.

"ఏంటో... ఆ సినిమాకు వెళ్దామా... నువ్వేం చెప్పినా చేస్తాను. సిగరెట్ తాగమని మాత్రం అనొద్దు..." అన్నాడు.

"నువ్వు నా కాళ్ళ మీద పడ్డం తప్పు బావా..." అంది కూల్‌గా నీలవేణి.

"హాయిగా ఆవకాయతో వేడి వేడి అన్నం తినాలని ఉంది" అన్నాడు గోపాలం మారాం చేస్తున్నట్టుగా ఏడుపు గొంతుతో కాసిన్ని గారాలుపోతూ!"

"మరి సిగరెట్లు ?"

"ఆ మాటంటే నా మీదొట్టు, నన్ను చంపుకుతిన్నంత ఒట్టు" బిక్కచచ్చి అన్నాడు గోపాలం. ఇక చస్తే గోపాలం సిగరెట్ ఊసెత్తడు.

"ఓ అయిదారొందలు ఖర్చయితే అయ్యాయి కానీ అతిగా తాగి తాగి సిగరెట్ అంటేనే రోత పుట్టించిన బావలో మార్పే నీకు పెద్ద గొప్ప" అనుకుని మురిసిపోయింది నీలవేణి. ఇదంతా అతనితో సిగరెట్ అలవాటు మార్పించడానికి అని గోపాలానికి తెలియదు. తెలియకపోవడమే మంచిది.

●